13012024-DIS-16_Layout 1 1/13/2024 3:14 AM Page 1

● పురుడు పోసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఓ మహిళకు పురుడుపోశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో లింగాల మండలం జీనుగుపల్లికి చెందిన గర్భిణీ ప్రసన్న పురిటినొప్పులతో బాధపడుతుంటే విషయం తెలుసుకుని వృత్తిధర్మాన్ని పాటించారు. అక్కడున్న డాక్టర్లతో కలిసి ఆమెకు సర్జరీ చేయడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించిన ఎమ్మెల్యేకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. - అచ్చంపేట రూరల్

శుక్రవారం బాల్కొండ మండలం నాగపూర్ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

కేసీఆర్ పథకాలను కొనసాగించాలి

- సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు రద్దు చేయడం సరికాదు
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల

బాల్కొండ/వేల్పూర్/ఏర్గట్ల, జనవరి 12 : కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను యథావిధిగా కొనసాగించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏర్గట్ల, బాల్కొండ, వేల్పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రా లు, పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను రద్దు చేయడం సరికాదని, వాటిని అలాగే కొనసాగించాలని సూచించారు. ఆ పనులన్నీ ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ అప్రూవల్‌తో వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు నిజామాబాద్, సిరిసిల్ల కలెక్టర్లు తెలంగాణ ప్రభుత్వం తరపున అధికారికంగా మంజూరు చేసినవని గుర్తుచేశారు. ప్రజలు, వీడీసీ, కుల సంఘాల సభ్యులు మంజూరైన పనుల ప్రారంభం కోసం ఆశతో ఉన్నారని తెలిపారు. కావాలంటే స్థానిక అధికార పార్టీ నాయకులు ఆ పనులు కొనసాగించేలా చూడాలని, ఆ పనుల క్రెడిట్ కూడా వారే తీసుకోవాలని సూచించారు.

ఎంజీఎంకు వరల్డ్ స్ట్రోక్ ప్లాటినం హోదా అవార్డు

వరంగల్ చౌరస్తా, జనవరి 12: వరంగల్ ఎంజీఎం మరో అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకున్నది. పేదలకు వైద్య సేవలు అందించడంలో ఎన్నో అవార్డులు గెలుచుకున్న ఎంజీఎం.. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రఖ్యాతి గాంచిన అవార్డును సొంతం చేసుకున్నది. థ్రోంబోలిటిక్ థెరపీ (బ్రెయిన్ స్ట్రోక్) బాధితులకు అందిస్తున్న వైద్యసేవలకు గాను ప్రపంచ స్ట్రోక్ సంస్థ మన దేశం నుంచి ఎంజీఎంకు ఉత్తమ పనితీరుకు ప్లాటినం హోదా అవార్డును అందజేసింది. సంస్థ ప్రతినిధులు ఈ అవార్డును పంపించగా, ఎంజీఎం జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్లు డాక్టర్ భిక్షపతిరావు, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్ దవాఖాన సూపరింటెండెంట్‌కు అందజేశారు.

లాభాల మునగ

- కాయలతోపాటు ఆకులోనూ ఔషధ గుణాలు
- పౌడర్‌గా మార్చి విక్రయం.. వంద గ్రాములు రూ.100
- వ్యాధులు దూరం.. ఆరోగ్యానికి ఎంతో మేలు
- గన్నేరువరం మండలం మైలారంలో సాగు చేస్తున్న రైతు

కరీంనగర్ జిల్లా మైలారంలోని తోటలో మునగ చెట్టు ఆకులు తెంపుతున్న రజినీరమణారెడ్డి దంపతులు

తిమ్మాపూర్/గన్నేరువరం, జనవరి 12: మునగ చెట్టు రానురానూ వాణిజ్య పంటగా మారిపోతున్నది. మునగకాయలతోపాటు వాటి ఆకులోనూ అనేక ఔషధ గుణాలు ఉండడం, అవి ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తుండటంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారంలోని రైతు దంపతులు ముత్యాల రజినీ రమణారెడ్డి అందరికంటే వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. కేవలం మునక్కాయలను అమ్మడమే కాకుండా మునగ ఆకును పొడిగా తయారు చేసి విక్రయించడం ద్వారానూ లాభాలు పొందుతున్నారు.

ఎకరంలో సాగు

వ్యవసాయమే జీవనాధారంగా ముందుకు సాగుతున్న ముత్యాల రజినీ రమణారెడ్డి దంపతులు గతంలో వివిధ రకాల పంటలు వేసినా అంతగా ప్రయోజనం లేకపోయింది. దీంతో కొత్తగా ఏదైనా చేయాలని భావించిన ఆ దంపతులు.. నాబార్డు అధికారుల సూచనతో మునగ తోట సాగు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఏడాది క్రితం తక్కువ ఖర్చుతో ఎకరం భూమిలో మునగ మొక్కలు నాటి, డ్రిప్ ద్వారా నీరు పెడుతున్నారు. సాధారణంగా మునగకు నీరు అవసరం ఉండదు. కానీ, రజినీ రమణారెడ్డి దంపతులు మునగ ఆకును సేకరించి పౌడర్ తయారు చేస్తున్నందున ఎక్కువ నీరు అందిస్తున్నారు. దీంతో ఆకు త్వరగా పెరుగుతున్నది.

వంద గ్రాముల ప్యాకెట్ రూ.100

మునగ ఆకును పౌడర్ చేసి విక్రయించుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్న అధికారులు.. అందుకు అవసరమైన యంత్రాలను రజినీ రమణారెడ్డి దంపతులకు అందజేశారు. వీటి సాయంతో వారు మునగ ఆకును పొడిగా తయారు చేసి, 100 గ్రాముల ప్యాకెట్‌ను రూ.100 చొప్పున స్థానికంగానే విక్రయిస్తున్నారు.

ప్రభుత్వం చొరవ తీసుకుంటే..

మైలారంతోపాటు చిగురుమామిడి మండలం సుందరగిరిలో ఇప్పటికే పలువురు రైతులు నాబార్డు సాయంతో మునగ సాగు చేస్తున్నారు. కానీ, మునగ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో రైతులకు లాభాలు నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు మునగ ఆకు పౌడర్‌ను అందిస్తే పౌష్టికాహార లోపాన్ని నివారించడంతోపాటు రైతులకూ లాభం చేకూరుతుంది.

అవగాహన పెంచాలి..

మునగ వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ వాటిపై ప్రజలకు సరైన అవగాహన లేదు. దీంతో డిమాండ్ అంతంత మాత్రంగానే ఉన్నది. నేను ఎకరం లో సాగుచేసిన మొక్కలతో చాలా పౌడర్ తయారు చేయవచ్చు. కానీ, మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది అవుతున్నది. ప్రభుత్వం చొరవ తీసుకుని మునగ వల్ల కలిగే లాభాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తే మార్కెటింగ్ పెరిగి మాకు మరింత ఆదాయం లభిస్తుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలి.

- ముత్యాల రమణారెడ్డి, రైతు, మైలారం

ఎన్నో ఉపయోగాలు

మునగ ఆకు పౌడర్‌ను రోజూ గ్రాము చొప్పున తీసుకుంటే బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, క్యారెట్, ఓట్స్, అరటి పండ్లు, ఆకుకూరల్లో ఉండే విటమిన్లన్నీ మునగ ఆకు పౌడర్‌లో లభిస్తాయి. దీని వినియోగంతో ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. పలు రకాల వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మునగ ఆకులో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, అమినో యాసిడ్స్, సమృద్ధిగా ఉంటాయి. క్యారెట్ కంటే మునగ ఆకులో విటమిన్లు ఎన్నో రెట్లు అధికంగా ఉంటాయి. థైరాయిడ్‌ను అదుపులో ఉంచే సహజ ఔషధంగా పేరున్న మునగ ఆకును కంటి వ్యాధులకు సంబంధించిన మెడిసిన్‌లోనూ వాడతారు. ఇందులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్‌తో షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. మునగ ఆకు రసాన్ని పాలలో కలిపి పిల్లలకు అందిస్తే ఎముకలు బలంగా తయారవుతాయి. గర్భిణులు, బాలింతల్లో కాల్షియం, ఐరన్ లోపాన్ని తొలగించేందుకు మునగ ఆకు ఎంతో ఉపయోగపడుతుంది.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

హసన్‌పర్తి, జనవరి 12: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని ఓ యూనివర్సిటీలో శుక్రవారం డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. సీఐ గోపి కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా మావల గ్రామానికి చెందిన రాథోడ్ దీప్తి(19) బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. హాస్టల్ గదిలో ముగ్గురు బీటెక్ విద్యార్థినులతో కలిసి ఉంటున్నది. సెలవులు ఇవ్వడంతో వారు హాస్టల్‌కు రాలేదు. గదిలో గురువారం రాత్రి దీప్తి భోజనం చేసి నిద్రపోయింది. తెల్లవారుజామున 4 గంటలకు లేచి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఫస్ట్ ఇయర్‌లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతోపాటు ప్రేమ విఫలం కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ తెలిపారు.

మిర్చి కాంటాలో కోతలెందుకు?

- మార్కెట్‌లో క్వాలిటీ తనిఖీ అధికారి ఎక్కడ?
- ఖమ్మంలో కొనుగోళ్లపై మంత్రి తుమ్మల అసంతృప్తి

ఖమ్మం, జనవరి 12 : వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు ధర నిర్ణయించిన తర్వాత కాంటాలో కోతలు ఎందుకు పెడుతున్నారని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ కార్యదర్శిని నిలదీశారు. శుక్రవారం ఆయన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చి యార్డులో మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి కలియతిరిగారు. రైతు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి పంట నాణ్యతను పరిశీలించారు. యార్డులో మిర్చి నాణ్యతను పరిశీలించే అధికారి ఎక్కడ? అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. నాణ్యమైన మిర్చిని వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తుంటే.. అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదని మండిపడ్డారు. మార్కెట్‌కు సరుకు తెచ్చిన రైతులు మోసపోకుండా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని వ్యాపారులకు నిర్దేశం చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే రైతుల లాట్‌ల వద్దకు వెళ్లి 'ఎంత పంట వేశారు? ఖర్చు ఎంత? దిగుబడి ఎంత వచ్చింది?' అని మంత్రి ఆరా తీశారు. రైతులు మాత్రం క్వింటా మిర్చి గత ఏడాది రూ.14 వేలు పలికితే.. ఈ ఏడాది రూ.10 వేలు ధర పెట్టి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మార్కెటింగ్ శాఖ అధికారులతో తుమ్మల సమీక్ష నిర్వహించారు.

మాదిగలను దగా చేసిన బీజేపీ

- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తాం
- టీఎస్ ఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి

హనుమకొండలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

హనుమకొండ, జనవరి 12 : ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాట తప్పిన మోదీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేసి పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా మాదిగలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో స్వయంగా మోదీ వర్గీకరణ విషయంలో స్పష్టత ఇవ్వకుండా ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కూడా పెట్టకుండా మోసం చేసినట్టు ఆయన దుయ్యబట్టారు.

లిఫ్ట్ ఇచ్చి బంగారం చోరీ

- యువతీయువకుడు కలిసి తస్కరణ
- నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఘటన

దోపిడీకి పాల్పడిన యువతి, యువకుడు

మర్రిగూడ, జనవరి 12 : ఓ యువతి, యువకుడు మహిళకు లిఫ్ట్ ఇచ్చి దారిలో దోపిడీకి పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై రంగారెడ్డి, బాధితురాలి కథనం ప్రకారం.. మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లికి చెందిన చాట సునీత శుక్రవారం ఉదయం ఈకేవైసీ చేయించునేందుకు మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి బయల్దేరింది. బస్సు కోసం గ్రామంలోని రోడ్డు మీద ఎదురుచూస్తుండగా మర్రిగూడ నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై వెళ్తున్న ఓ యువతి, యువకుడు ఆమెను గమనించి కొంచెం ముందుకు వెళ్లి తిరిగి వెనక్కి మళ్లారు. తాము మర్రిగూడ వైపు వెళ్తున్నామని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి బండి ఎక్కించుకున్నారు. యరగండ్లపల్లి సమీపంలోకి రాగానే సునీత మొహంపై మత్తు జల్లి 4 తులాల పుస్తెల తాడు, 3 తులాల చెవి కమ్మలను చోరీ చేశారు. తిరిగి మళ్లీ వచ్చిన దారినే హైదరాబాద్ వైపు ఉడాయించారు. కొద్దిసేపటికి తేరుకున్న బాధితురాలు లబోదిబోమంటూ మర్రిగూడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల సాయంతో నిందితులను గుర్తించారు.